## క్లుప్తంగా

### గరుడ వాహనంపై చెన్నకేశవస్వామి



గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాత మార్కెట్‌లోని మహాలక్ష్మి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం చెన్నకేశవ స్వామి, మహాలక్ష్మి మూల విరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై పురవీధుల్లో గోవిందనామ స్మరణల మధ్య ఊరేగించారు. భక్తులు స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు.

### హెడ్ నర్స్‌కు సన్మానం



హెడ్ నర్స్ విజయమ్మను సన్మానిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్స్‌గా పని చేస్తున్న ఎస్.విజయమ్మకు కడప రిమ్స్‌లో హెడ్ నర్స్‌గా ప్రమోషన్ లభించింది. ఈ సందర్భంగా సోమవారం కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ హనీఫ్ బాబా, ఏపీ ఎన్జీఓ తాలూకా అధ్యక్షుడు రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో విజయమ్మను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయమ్మ 32 ఏళ్లుగా స్టాఫ్‌నర్స్‌గా పనిచేసి విశిష్టమైన సేవలు అందించారని పేర్కొన్నారు. ఆమె అందించిన సేవలను గుర్తు చేసుకుని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్లు శివప్రసాద్ రెడ్డి, శ్రీనివాస్, ఎన్జీఓ సెక్రటరీ రామసుబ్బయ్య, మైదుకూరు ప్రెసిడెంట్ చంద్రమౌళి, హెల్త్ ఎడ్యుకేటర్స్ వెంకటేశ్వర్లు, శోభారాణి, సీహెచ్ఓ కృష్ణమ్మ, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీను, సూపర్ వైజర్లు వరప్రసాద్, చంద్రకళ, ఎన్జీఓ అసోసియేషన్ నాయకులు సుజాత, మధుసూదన్, ప్రభంజన్ రెడ్డి, శివ, జయరాజు, ఫార్మసిస్ట్ శ్రీధర్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ తేజ, హెల్త్ అసిస్టెంట్లు సుబ్బయ్య, లక్ష్మీనారాయణ, చంద్ర, శ్రీను పాల్గొన్నారు.

### వంటల పోటీలు



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు

చాపాడు : చాపాడులోని స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద సోమవారం పిల్లలకు రుచికరమైన, పరిశుభ్రమైన వంటలు ఎలా చేయాలి అనే అంశంపై వంట ఏజెన్సీ నిర్వాహకులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వంటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వహించే వంట ఏజెన్సీ నిర్వాహకులకు నిర్వహించిన వంటల పోటీలలో చాపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కొండారెడ్డికి ప్రథమ, కేతవరం ఎంపీపీ స్కూల్‌కు చెందిన అశ్వనికి ద్వితీయ, అనంతపురం స్పెషల్ స్కూల్‌కు చెందిన సాలమ్మకు తృతీయ బహుమతి గెలుపొందినట్లు ఎంఈఓలు రవి శంకర్, వంశీ కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### 30న సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

ప్రొద్దుటూరు : స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఈ నెల 30న ఉదయం 10 గంటలకు సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సీఐటీయూ 1970లో ఆవిర్భవించిందని తెలిపారు. కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్నామని చెప్పారు. ఆవిర్భావ దినోత్సవం రోజున జెండా ఆవిష్కరిస్తామని, ప్రతి కార్మికుడు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి బి.విజయకుమార్, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.

# పార్కింగ్ .. పరేషాన్

- రోజురోజుకు పెరుగుతున్న వాహనాల సంఖ్య
- పాదచారులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బంది
- పోలీసుల ఆంక్షలతో తిప్పలు
- స్థలం కేటాయించాలంటున్న స్థానికులు



అంబేడ్కర్ సర్కిల్‌లో రోడ్డు పక్కన నిలిపిన ద్విచక్ర వాహనాలు

బద్వేలు అర్బన్ : దినదినాభివృద్ధి చెందుతున్న బద్వేలు పట్టణంలో వాహనదారులకు పార్కింగ్ కష్టాలు ఎదురవుతున్నాయి. పట్టణంలో ద్విచక్ర వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలాలు లేకపోగా.. పోలీసు ఆంక్షలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయకుండా షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం, రోడ్డు ఆక్రమణలతో సమస్య మరింత జటిలమవుతోంది. పట్టణంలో ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాలు ఉన్నప్పటికీ ఆ దిశగా మున్సిపల్, పోలీసు, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

**కనిపించని పార్కింగ్ స్థలాలు**

పట్టణంతో పాటు మండల పరిధిలో సుమారు 1.50 లక్షల మంది జనాభా నివసిస్తుండగా సుమారు 25 వేలకుపైగా ద్విచక్ర వాహనాలున్నట్లు అంచనా. పట్టణవాసులతో పాటు మండల పరిధిలోని ప్రజలు నిత్యం ఏదో ఒక పనిమీద పట్టణానికి వస్తుంటారు. పట్టణంలోని నెల్లూరు రోడ్డు, సిద్దవటం రోడ్డు, పోరుమామిళ్ల రోడ్డు, మైదుకూరు రోడ్డు, కూరగాయల మార్కెట్ కూడలి, మాంసపు దుకాణాల వద్ద, స్టేట్ బ్యాంక్ ఏరియా తదితర ప్రాంతాలలో నిత్యం వివిధ రకాల పనులపై ప్రజలు వస్తుంటారు. అయితే ఆయా ప్రాంతాలలో పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

**ఆంక్షలతో తప్పని ఇబ్బందులు**

పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో పట్టణానికి వివిధ పనులపై వచ్చే ద్విచక్ర వాహనదారులు ఆయా దుకాణాలు, కార్యాలయాల వద్ద రోడ్డు పక్కన వాహనాలు ఆపి తమ పనులు చూసుకుని వెళ్తుంటారు. ఈ సమయంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పేరుతో వాహనాలు రోడ్డుపై నిలుపకూడదని పోలీసులు గట్టిగా హెచ్చరిస్తుండడంతో పాటు కొన్ని సందర్భాలలో వాహనాలకు జరిమానా కూడా విధిస్తుండటంతో ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపాలిటీ హోదా కలిగిన పట్టణాలలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజల సౌకర్యార్థం తప్పనిసరిగా పార్కింగ్ ప్రదేశాలు ఉండాల్సి ఉన్నప్పటికీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీ, పోలీసు, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు సంయుక్తంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆటోస్టాండ్‌లకు కూడా అనువైన స్థలాలు లేకపోవడంతో ఆటోలను రోడ్లపైనే నిలుపుతున్నారు. అధికారులు దృష్టి సారించి రోడ్లపై తోపుడుబండ్లను తొలగించి పార్కింగ్ కోసం స్థలాలను ఏర్పాటు చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

**ఇబ్బందులు పడుతున్నాం**



పట్టణంలో పార్కింగ్ ప్రదేశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కూరగాయల మార్కెట్‌కు కిరాణా షాపుకు ద్విచక్రవాహనంపై వెళ్తుంటాం. అయితే వాహనం దుకాణం ఎదుట నిలిపి సరుకులు తీసుకుని వచ్చేలోపే పోలీసులు వాహనాలు తీసేయాలని హెచ్చరిస్తున్నారు. పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేస్తే ఆ సమస్య ఉండదు. త్వరగా సమస్యను పరిష్కరించాలి.

- టి.వెంకటసుబ్బయ్య, బద్వేలు

**అధికారులు చొరవ చూపాలి**



పట్టణంలో పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటుకు అధికారులు చొరవ చూపాలి. పార్కింగ్‌కు అనువైన ప్రదేశాలు లేకపోవడంతో హైస్కూల్‌లోను, తహసీల్దారు కార్యాలయ ఆవరణలో వాహనాలు నిలపాల్సి వస్తోంది. వీలైనంత త్వరగా పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయాలి. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, పోలీసులు సమన్వయంతో సమస్యను పరిష్కరించాలి.

- ఎస్.షఫి, బద్వేలు

**చర్యలు తీసుకుంటాం**



పట్టణంలో పార్కింగ్ ప్రదేశాలు లేకపోవడం వలన వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలుపుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో కూరగాయల మార్కెట్ వద్ద పరిస్థితి ఇబ్బందికరంగా తయారైంది. ఈ సమస్యను అధిగమించేందుకు మున్సిపల్, రెవెన్యూ అధికారులతో చర్చించి వీలైనంత త్వరగా పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- పి.యుగంధర్, అర్బన్ సీఐ

## కక్ష సాధింపు చర్యలు సరికాదు



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

బి.కోడూరు : తెలుగుదేశం పార్టీ నాయకులు నిరాధారమైన ఆరోపణలతో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన వెంటనే పూర్వాపరాలు విచారించకుండానే వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన బి.కోడూరు తహసీల్దారు కార్యాలయంలో పెద్దుళ్లపల్లె గ్రామ పొలం సర్వే నంబర్ 335కు సంబంధించి వైఎస్సార్‌సీపీకి చెందిన ఇద్దరు కార్యకర్తలు 2005 నుంచి తమ ఆధీనంలో ఉంటూ సాగు చేసుకుంటున్న పొలంలో వారం రోజుల క్రితం జామాయిల్ మొక్కలను నాటారని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. అయితే రెవెన్యూ అధికారులకు తెలుగుదేశం నాయకులు ఫిర్యాదు చేయడంతో సిబ్బందితో కలసి లక్షల రూపాయలు ఖర్చు చేసి నాటిన జామాయిల్ మొక్కలను అధికారులు పీకేశారని తెలిపారు. దీంతో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి సోమవారం తహసీల్దారును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు ఇచ్చే అర్జీలకు వెంటనే స్పందిస్తున్న రెవెన్యూ అధికారులు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇచ్చే ఫిర్యాదులపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రెండు సంవత్సరాలుగా పెద్దుళ్లపల్లె గ్రామపొలం సర్వే నంబర్లు 279, 57, 946కు సంబంధించి, బి.కోడూరు గ్రామ పొలానికి సంబంధించి కొన్ని సర్వే నంబర్లు, కామకుంట, వేమకుంట గ్రామ పొలాలకు సంబంధించి కొన్ని సర్వే నంబర్లపైన మండల తహసీల్దారు కార్యాలయంలోను, ఆర్డీఓ కార్యాలయంలోనూ పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదని విమర్శించారు. టీడీపీ నాయకులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారుల అత్యుత్సాహం చూపడంలో ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



చాపాడు: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఆర్‌వీ కొండారెడ్డి



కాశినాయన : నరసాపురంలో నాయకులతో మాట్లాడుతున్న సీఐ చిరంజీవి

కాశినాయన : జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, ఎవరైనా కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోరుమామిళ్ల సీఐ చిరంజీవి, కాశినాయన ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నరసాపురంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలతో సమావేశం నిర్వహించి శాంతిభద్రతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ రోజున ఎవరైనా గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో అందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు. ఎన్నికల ఫలితాల రోజున బాణాసంచా పేల్చడం, అల్లర్లు సృష్టించడం లాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో గుంపులు గుంపులుగా ఉండకుండా ఎవరి ఇళ్లలో వారు ఉండాలని తెలిపారు. పోలీసు సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

**ర్యాలీలు, ఊరేగింపులు నిషేధం**

చాపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భాగంగా జూన్ 4న జరగబోవు ఎన్నికల కౌంటింగ్ రోజున ర్యాలీలు, ఊరేగింపులు నిషేధించామని ఎస్ఐ ఆర్‌వీ కొండారెడ్డి తెలిపారు. మండలంలోని అల్లాడుపల్లెలో సోమవారం సాయంత్రం గ్రామ ప్రజలతో పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజున మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని ప్రజలందరూ దీనిని పాటించాలన్నారు. కౌంటింగ్ రోజున గ్రామాలలో ర్యాలీలు, ఊరేగింపులు చేయరాదని, బాణా సంచా కాల్చరాదని సూచించారు. ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నా పోలీసుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా ర్యాలీలు, ఊరేగింపులు చేసినా బాణాసంచా కాల్చినా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రభుత్వ స్థలం కబ్జా చేస్తే చర్యలు



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వార్డు నాయకులు

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులోని శివానగర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జాకు గురికాకుండా చూడాలని సోమవారం మున్సిపల్ కమిషనర్, గోపవరం డిప్యూటీ తహసీల్దారుకు స్థానిక నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివానగర్‌లోని సచివాలయం సమీపంలో సర్వే నంబర్ 836లో గతంలో కొనసాగుతున్న మరుగుదొడ్డిని మున్సిపల్ అధికారులు తొలగించడంతో స్థలం ఖాళీగా ఉండేదని, అయితే కొందరు ఆ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలం కబ్జాకు గురికాకుండా కాపాడటంతో పాటు ఆ స్థలాన్ని అంగన్‌వాడీ కేంద్రానికి లేదా సచివాలయ నిర్మాణానికి కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న పనులను నిలుపుదల చేయించామని, ఎవరైనా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు రంగయ్య, వెంకటసుబ్బయ్య, నాగేశ్వర్‌రావు, వంశీకృష్ణ, ఎం.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మైదుకూరు :మైదుకూరులో మంగళ, బుధ వారాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పాటుతుందని ట్రాన్స్‌కో ఏఈ రామభద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరులోని 220 కేవీ సబ్ స్టేషన్‌లో శ్రీశైలం ఫీడర్‌కు సంబంధించి సర్క్యూట్ బేకర్ మరమ్మతుల కారణంగా ఈ అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు.

## యల్లయ్యకు అవార్డు



అవార్డు అందుకుంటున్న యల్లయ్య

పోరుమామిళ్ల: పోరుమామిళ్లకు చెందిన చెక్క భజన కళాకారుడు యల్లయ్యను ఆదివారం హైదరాబాదులో అవార్డుతో సత్కరించారు. మెగా ఎంటర్ ప్రైజస్ ఐకాన్ అండ్ నంది పురస్కారాల మహోత్సవంలో యల్లయ్య చెక్కభజన ప్రదర్శనకు పురస్కారం లభించింది. సింగర్ ప్రణయ్, సీరియల్ నటులు శివ రవితే, విశాలక్ష్మి, మెగా ఎంటర్ ప్రైజెస్ వ్యవస్థాపకులు శిరీషారెడ్డి యల్లయ్యకు అవార్డు అందచేశారు. కడప, ప్రకాశం జిల్లాల్లో అనేక ప్రదర్శనలిచ్చారు.

## పశువులకు టీకాలు తప్పక వేయించాలి



సోమిరెడ్డిపల్లెలో దూడలకు టీకాలు వేస్తున్న ఏడీ డాక్టర్ శారదమ్మ

బ్రహ్మంగారిమఠం: పసువులకు గొంతు వాపు వ్యాధి టీకాలు, జీవాలకు చిటుక్ వ్యాధి టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశు సంవర్ధక సహాయక సంచాలకులు శారదమ్మ సూచించారు. బి.మఠం, బి.కోడూరులోని ఆర్బీకే కేంద్రాలకు చెందిన 19 మంది పశు సంవర్ధక సహాయకులకు సోమవారం శారదమ్మ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మల్లేపల్లె, సోమిరెడ్డిపల్లె, గొల్లపల్లె తదితర గ్రామాల్లో జీవాలకు టీకాలు వేశారు. ఈ కడప డివిజన్ సహాయక సంచాలకులు టి వెంకటరమణయ్య, బి.మఠం సహాయక సంచాలకులు కె.వెంకటసుబ్బయ్య, పెద్దిరాజుపల్లె, ప్రభలవీడు, బి.కోడూరు పశువైద్యులు నిత్యానంద్, లక్ష్మినరసయ్య, ఎం.భరద్వాజ కృష్ణ పాల్గొన్నారు.

## ఘనంగా ఉద్యోగ సాధకుల దినోత్సవం



నియామక పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం ఉద్యోగ సాధకుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి మాట్లాడుతూ డైరెక్ట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు ఈ విద్యాసంవత్సరంలో వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గౌరవించడం కోసం ఉద్యోగ సాధకుల దినోత్సవం నిర్వహించామన్నారు. తమ కళాశాలలో 144 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. విద్యుత్ శాఖ డీఈ శిరీష మాట్లాడుతూ డిప్లమో విద్యార్థులకు లభించే ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. ఒరాకిల్ కన్సల్టెన్సి ప్రిన్సిపాల్ నరేష్, కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, సెక్రటరీ వీరకల్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీదే అధికారం

జమ్మలమడుగు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోనికి రావడం తథ్యమని ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి(ఉత్తర అమెరికా) పండుగాయల రత్నాకర్ అన్నారు. యూఎస్ఏ సోషల్ మీడియా కో–కన్వీనర్ చిలాల కిరణ్‌రెడ్డి, పలువురు ఎన్ఆర్ఐలు ఎర్రగుంట్ల మండలం నిడిజివ్వి గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లాలో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జూన్ 9న విశాఖపట్నంలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని, మహిళలు భారీ స్థాయిలో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారన్నారు. సోషల్ మీడియా కో–కన్వీనర్ చిల్లా కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ మంచి జరిగి ఉంటే తనకు మద్దతు పలకాలని ధైర్యంగా చెప్పిన ఏకైక నాయకుడు జగన్ అన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్

బద్వేలు అర్బన్ : గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వి.మల్లేష్ పేర్కొన్నారు. స్కానింగ్ సెంటర్ల యజమానులు, ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యం లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ ఆవరణలో పీఎస్‌పీఎన్‌డీటీ యాక్టుపై బద్వేలు, గోపవరం మండలాల వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లు, ప్రైవేటు ఆసుపత్రులపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తుంటామని, లింగ నిర్ధారణ పరీక్షలు జరిగినట్లు రుజువైతే అలాంటి చర్యలకు పాల్పడిన వైద్యులు, స్కానింగ్ సెంటర్ల యజమానులపై, ప్రోత్సహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో వైద్యాధికారులు డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి, డాక్టర్ మురళీకృష్ణ, వెంగయ్య పాల్గొన్నారు.

## అదనపు డ్యూటీలకు డబ్బు చెల్లించాలి

మున్సిపల్ కమిషనర్‌కు వినతి



మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్మికులకు అదనపు డ్యూటీలకు డబ్బు చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ పట్టణ అధ్యక్షుడు చంటి, ప్రధాన కార్యదర్శి సాల్‌మోన్ మాట్లాడుతూ ఈ నెల ఎన్నికలు జరగడంతో మున్సిపల్ కార్మికులకు అదనంగా పాలిటెక్నిక్ కాలేజి వద్ద, పోలింగ్ బూత్‌ల వద్ద డ్యూటీలు వేశారన్నారు. అదనపు డ్యూటీలకు తగిన డబ్బు చెల్లించాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. కరోనా సమయంలో తీసుకున్న కార్మికులకు ఒక నెల పెండింగ్ వేతనం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్, రవి, ప్రమీలమ్మ, గుర్రమ్మ, రమాదేవి, నీతమ్మ పాల్గొన్నారు.

## ఆటలతో మానసికోల్లాసం




ప్రొద్దుటూరు : మాట్లాడుతున్న జింకా సుబ్రహ్మణ్యం



ప్రొద్దుటూరు కల్చరల్ : కథ చెబుతున్న విద్యార్థిని

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆటలతో మానసికోల్లాసం లభిస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు అన్నారు. స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో సోమవారం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరంలో కథలు, పద్య పఠనం, ఆటలు, పాటలతో వినోదంతోపాటు విజ్ఞానం అందిస్తున్నట్లు తెలిపారు. విలువైన సమయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రిటైర్డ్ వైమానిక దళ అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటకొండయ్య విద్యార్థులకు ఇంగ్లిష్ గ్రామర్‌ను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాంసాహెబ్, ఉపాధ్యాయురాలు నిర్మలజ్యోతి, చెంద్రాయుడు, రెహమాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

**ఆధునిక భారత నిర్మాత నెహ్రూ**

ప్రొద్దుటూరు : ఆధునిక భారత నిర్మాత జవహర్ లాల్ నెహ్రూ అని రచయిత జింకా సుబ్రహ్మణ్యం కొనియాడారు. సోమవారం స్థానిక పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో నెహ్రూ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం తొలి దేశతొలి ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ పనిచేశారన్నారు. ఆయన హయాంలో బహుళార్థక సాధక ప్రాజెక్టులను నిర్మించారన్నారు. మహాత్మా గాంధీ పిలుపు మేరకు నెహ్రూ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారని పేర్కొన్నారు. స్పోకెన్ ఇంగ్లీషు మాస్టర్ పవన్ కల్యాణ్ ఇంగ్లిష్‌లో గ్రామర్ మెళకువలను నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి తిరుపతి పాల్గొన్నారు.

**గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరం**



పోరుమామిళ్ల: పేపర్‌తో బొమ్మలు తయారు చేయడాన్ని నేర్పిస్తున్న ప్రసాదరెడ్డి

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల గ్రంథాలయంలో రెండు వారాలుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థుల సంఖ్య, పాఠకుల సంఖ్య బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం సీనియర్ సిటిజన్ కొండా ప్రసాదరెడ్డి విద్యార్థులకు మిమిక్రీ ప్రదర్శన ఇచ్చారు. అలాగే పేపర్‌తో వివిధ రకాల బొమ్మలు తయారు చేసే విధానం చూపించారు. పేపర్లతో కిరీటం, పడవలు, గౌను, వివిధ జంతువులు, పక్షుల ఆకారాలు తయారు చేశారు. జేవీవీ జిల్లా కార్యవర్గసభ్యులు దాదాపీర్ శతక పద్యాలు బోధించారు. సమ్మర్ క్యాంపు ముగిసేలాగా ప్రతి ఒక్కరూ 10 పద్యాలు నేర్చుకోవాలని సూచించారు. గణిత ఉపాధ్యాయుడు పీర్‌బాషా గణితంలో చతుర్విధ ప్రక్రియలు చేసి చూపించారు. లైబ్రేరియన్ ఆఫ్రిది విద్యార్థులకు చెస్, క్యారంబోర్డులో మెలకువలు నేర్పించారు.